# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 24 మే 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 314

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## భారత్‌ను విభజించి రెండు ముస్లిం దేశాలు చేసిన కాంగ్రెస్



# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు తుస్

- మహిళలకు బస్సు ప్రయాణం కూడా అనుమానమే
- ఉద్యోగుల నాలుగు డీఎలపై మాట్లాడడం లేదు
- ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపిస్తే మండలిలో కొట్లాడుతాం
- హన్మకొండ సన్నాహక సభలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

**హైదరాబాద్,వేగుచుక్క న్యూస్ :** ఆరు గ్యారంటీల్లో ఒకే ఒక హామీ మాత్రమే అమలైందని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ కూడా తుస్సేనని ఎద్దేవా చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా హన్మకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన పట్ట భద్రుల ఉప ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు నాలుగు డీఏలు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసింది. అందుకోసం అసెంబ్లీ, కౌన్సిల్‌లో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా కలిసి పోరాడతాం. అందుకు ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపించాలని అన్నారు. నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీఛార్జి చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. నిరుద్యోగ భృతి హామీపై నిలదీస్తే.. అలా చెప్పలేదని అసెంబ్లీలో భట్టి విక్రమార్క

అంటున్నారు. కరెంటు బిల్లులు, భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడానికి సిద్ధమవుతున్నారు. ఒక వైపు సంక్షేమానికి కోతలు.. మరో వైపు వాతలా? అన్ని వర్గాలను మోసం చేయడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయింది. అందుకే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబితే కాంగ్రెస్ దారికొస్తుందని హరీశ్‌రావు అన్నారు. పట్ట భద్రుల సీట్ బీఆర్ఎస్ సొంతం చేసుకుంటుందని హరీష్ రావు అన్నారు. రాకేష్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలి. ఎమ్మెల్యే స్థానంలో ఎమ్మెల్సీ గెలిపించాలి. కాంగ్రెస్ పాలనలోఉచిత బస్సు పథకం తప్ప అన్నీ తుస్. ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది. రైతాంగాన్ని నిలువునా మోసం చేసింది. ఇందిరమ్మ ఇల్లు, పింఛన్, అమలు చేసుడు విస్మరించింది. విద్యార్థి, నిరుద్యోగుల, ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ కు ఓటు తో బుద్ధి చెప్పాలి. ఉపాధ్యాయులపై నారాయణ ఖేడ్ లో లాఠీ ఛార్జి చేయడం సిగ్గు చేటు. వడ్లకు బోనస్ ఎగ్గొట్టిన కాంగ్రెస్ రైతు బిడ్డలు బుద్ధి చెప్పండి. సంక్షేమ పథకాలలో కోతలు, ధరలు పెంచి వాత పెడుతున్న రేవంత్ కు విద్యా వంతులు బుద్ధి చెప్పాలని ఆయన వ్యాఖ్యానించారు. తీన్మార్ మల్లన్న గొంతు ఎందుకు మూగబోయింది. ప్రశ్నించే గొంతు రాకేష్ రెడ్డికి పట్టభద్రులు ఓటు వేయాలి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచిన బీజేపీ కి వాత పెట్టాలి. తెలంగాణ వాణి వినిపించాలంటే బీఆర్ఎస్ ను బలపర్చాలి. తెలంగాణ ఉద్యమ కార్లపై తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ కు పట్ట భద్రులు ఓటు వేయొద్దు.

హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని కుట్రలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వంకు గుణపాఠం చెప్పాలని అన్నారు. తెలంగాణ నీళ్లు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలించాలని బీజేపీ కుట్రలకు కాంగ్రెస్ వత్తాసు పలుకుతోంది. 2వేల పడకల ఆసుపత్రి చివరి దశకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలంగాణ చిహ్నం ను తొలగించాలని కుట్రలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో పంటలు కోనేటోళ్ళు లేరు, కరెంట్ సరఫరాలో విఫలమయ్యారు.

కాంగ్రెస్ అబద్దాలు, మోసాలను ప్రశ్నించడం రాకేష్ రెడ్డికి సాధ్యమని హరీష్ రావు పేర్కొన్నారు.

## పన్నులు చెల్లిస్తున్నాం... రోడ్లు బాగు చేయండి!





అధ్వానంగా మారిన రహదారిని బాగు చేయాలని డిమాండ్ చేస్తూ వర్షపు నీటితో నిండిన గుంతలో ఓ మహిళ బైఠాయించిన ఘటన హైదరాబాద్‌లోని నాగోల్ డివిజన్ ఆనంద్‌నగర్ చౌరస్తాలో గురువారం చోటుచేసుకుంది.

## ధ్యానాన్ని పనిలా కాదు.. పనిని ధ్యానంతో చేయాలి

'దేశంలో ఈర్ష్య, అసూయ, ద్వేషాలు పెరిగిపోతున్నాయి... ఉద్వేగాలు, స్పర్థలు పెంచేలా వాతావరణం కలుషితమవుతోంది... ఈ సమయంలో బుద్ధుడి సందేశాలను ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.





## రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి



**బాపట్ల:వేగుచుక్క న్యూస్ :** బాపట్ల జిల్లాలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలైన ఘటన వేటపాలెం మండలం పందిళ్లపల్లి బైపాస్ రోడ్డులో జరిగింది. వేటపాలెం పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల వైపు నుంచి కనిగిరి వెళ్తోన్న కారు అదుపుతప్పి పందిళ్లపల్లి నుంచి చీరాల వైపు వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన శిరీష(29) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త టెండూల్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో కారులో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలవ్వడంతో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# మేడిగడ్డ వద్ద మళ్లీ శబ్దాలు

- 7వ బ్లాకులోని గేటు ఎత్తుతుండగా ప్రకంపనలు
- బ్యారేజీ కింద భారీగా బొరియ
- ఏర్పడినట్టు అనుమానాలు.. దీనితో ప్రమాదమేననే అంచనా
- మొరాయించిన గేట్లు ఎత్తే పనులు తాత్కాలికంగా నిలిపివేత
- పనులు కొనసాగిస్తే బ్యారేజీ మరింతగా కుంగిపోవచ్చనే అంచనాలు
- జియోఫిజికల్/టెక్నికల్ టెస్ట్‌ల తర్వాతే ముందుకు కదలనున్న మరమ్మతులు




# జూన్ 5 తరవాత భారాసా దుకాణం బంద్

- కార్యకర్తలే పార్టీ నేతలపై తిరగబడతారు
- రాష్ట్ర సంపదను దోచుకుని చిప్పచేతికి ఇచ్చారు
- కవితపై 8వేల పేజీల చార్జిషీట్‌కు సమాధానం చెప్పండి
- కెటిఆర్ నోరు అదుపులో పెటుకోకుంటే ఖబర్దార్
- మంత్రి కోమటిరెడ్డి ఘాటు విమర్శలు




# డ్రగ్స్ టెస్ట్‌లో అడ్డంగా దొరికిన నటి హేమ

- బ్లడ్ శాంపిల్స్‌లో డ్రగ్స్ నమూనాల గుర్తింపు
- నమూనాలా ఆధారంగా చర్య తీసుకునే ఛాన్స్



వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ
2 24-5-2024



# మేడిగడ్డకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల్లోని ప్రధాన బ్యారేజీ మేడిగడ్డ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్మాణ సంస్థ ప్రతినిధులు, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్, సీడబ్ల్యూసీ ఇంజినీర్లు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడిగడ్డ పునరుద్ధరణ పనులపై ఇటీవల జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షణ సంస్థ (ఎన్డీఎస్ఏ) ప్రభుత్వానికి అందజేసిన మధ్యంతర నివేదిక మేరకు పనులు కొనసాగించాలన్నారు. వర్షాలు వచ్చేలోగా తీసుకోవాల్సిన పరిరక్షణ చర్యల్లో భాగంగా బ్యారేజీ వద్ద తాత్కాలిక పనులను పూర్తి చేయాలని సూచించారు. మేడిగడ్డ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అన్నారం, సుందిళ్ల వద్ద పనులనూ చేపట్టాలన్నారు. వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని, రోజువారీ పురోగతిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

## బియ్యం టెండర్లలో అవకతవకలు నిజం



**హైదరాబాద్:** సన్నబియ్యం టెండర్ల విషయంలో తన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, మంత్రి ఉత్తమ్ తన అనుయాయులకు టెండర్లు కట్టబెట్టారని మరోమారు బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఉత్తమ్ స్పందన కోసం బుధవారం పొద్దుపోయేదాకా ఎదురు చూసిన.. నేను వాస్తవాలు చెప్పాను కాబట్టే ఉత్తమ్ మొహం చాటేశారని వ్యాఖ్యానించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏం చేయాలో తెలియక నాపై పోలీస్ కేసు పెట్టిం చారని, ఉత్తమ్‌కు చేతనైతే బహిరంగ చర్చకు రావాలన్నారు. లేదా సిట్టింగ్ జడ్జితో కమిటీ వేసిన సరే సాక్ష్యాధారాలతో నిరూపించ డానికి రెడీ గా ఉన్నానని, సివిల్ సప్లై లో ఉన్న అవకతవకలు ఏ విధంగా సరి చేస్తారో చెప్పాలన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టమంటే పెట్టానని జగ్గారెడ్డి చెబుతున్నారని, సివిల్ సప్లై మీద జగ్గారెడ్డికి అవగాహన ఉండొచ్చు అని ఆయన మండిపడ్డారు. పోలీస్ కేసుల వల్ల సమస్య పరిష్కారం కాదని, 25- 1-24 న ఇచ్చిన జీవో లో స్పష్టంగా టెండర్ ప్రాసెసింగ్ చేయాలని చెప్పారన్నారు. అదే రోజు గ్లోబల్ టెండర్ పిలిచారని, గ్లోబల్ టెండర్ కోసం వివిధ రాష్ట్రాల నుంచి కొంత మంది వచ్చింది నిజం కాదా.. ? అదే రోజు కొంత మంది మిల్లర్లను పిలిచి ఏం చేశారో అధారాతో బయట పెట్టమంటారా..? కమిషన్ చౌహాన్, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు చెప్పాలన్నారు. క్వింటాలుకు 216 రూపాయాలు రైస్ మిల్లర్లు ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేసింది నిజం కాదా..? అని ఆయన ప్రశ్నించారు. మీరు చేసిన వసూళ్ల అరాచకం బయట పెట్టమంటారా..? అని ఆయన అన్నారు. అంతేకాకుండా.. 'ఉత్తమ్ కు దమ్ము ధైర్యం ఉంటే చర్చకు ఎందుకు రావడం లేదో చెప్పాలి. పోలీస్ కేసులకు, లీగల్ యాక్షన్లకు భయపడే వాడు కాదు ఏలేటి. కాలేజీలను, కోట్ల ఆస్తులను వదులుకొని రాజకీయాలపై మక్కువతో రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని.. 35 లక్షల మెట్రిక్ టన్నుల మీద 216 రూపాయలు వసూళ్లు జేస్తే 8 వందల కోట్లు వసూళ్లు చేశారా లేదా..? 60 రోజులవుతున్న ధాన్యాన్ని ఎందుకు లిఫ్ట్ చేయడం లేదు. ధాన్యాన్ని లిఫ్ట్ చేయకపోతే టెండర్లు తీసుకున్న కంపెనీలు ఏం చేస్తున్నట్టు..? 1 లక్ష మెట్రిక్ టన్నులకు పైగా బియ్యాన్ని క్వింటాలుకు 2259 రూపాయలకు అమ్మి, 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని క్వింటాల్ కు 5 వేల 700 పెట్టీ కొనడం వెనక మతలబు ఏంటో చెప్పాలి. ఒక్కొక్క చిట్టా మొత్తం విప్పుతా, నా దగ్గర పూర్తి సమాచారం ఉంది..' అని మహేశ్వర్ రెడ్డి అన్నారు.

## మేడిగడ్డ వద్ద మళ్లీ శబ్దాలు

హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద మళ్లీ ధ్వనులు, ప్రకంపనలు వచ్చాయి. కుంగిన ఏడో బ్లాకులోని 16వ నంబర్ గేటును పైకి ఎత్తడానికి నీటిపారుదల శాఖ ప్రయత్నించగా.. బ్యారేజీ కింద భూగర్భంలో నుంచి భారీగా బోలు శబ్దాలు , ప్రకంపనలు రావడంతో వెంటనే ఆ పనులను నిలిపేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సెన్సర్లు సైతం శబ్దాలు, ప్రకంపనలను గుర్తించి అలర్ట్ చేశాయి. దీంతో బ్యారేజీ పెను ప్రమాదానికి లోనయ్యే అవకాశం కనిపిస్తోందంటూ నీటిపారుదల శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయి..

గతంలో వరదల సమయంలో బ్యారేజీ పునాదుల కింద నుంచి ఇసుక కొట్టుకుపోయి, 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో భారీ బొరియ ఏర్పడి ఉండవచ్చని ఇప్పటికే నిర్వహించిన జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల ద్వారా ఓ అంచనాకు వచ్చినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు చెప్తున్నాయి. టన్నుల కొద్దీ బరువుండే గేటును పైకి ఎత్తే క్రమంలో పునాదులపై ఒత్తిడి పెరుగుతుందని.. పునాదుల కింద భూగర్భంలో బొరియ ఉండటంతో ఆ ఒత్తిడికి బ్యారేజీ మరింత కుంగిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గ్రౌటింగ్ ద్వారా భూగర్భంలోని ఖాళీలను పూడ్చివేశాకే గేట్లను పైకెత్తే పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. నిజానికి 7వ బ్లాకు కుంగిన తర్వాత అక్కడి నుంచి నీటి లీకేజీని ఆపడానికి.. ఏకంగా 40వేల ఇసుక బస్తాలు వేశారు. అయినా బ్యారేజీ కింద భారీగా ఖాళీ ఉందని అంచనాకు రావడం గమనార్హం.

ఇప్పటికే హెచ్చరించిన ఎన్డీఎస్ఏ..

మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 8 బ్లాకులు, 85 గేట్లు ఉండగా.. గతేడాది అక్టోబర్ 21న ఏడో బ్లాకు కుంగిన వెంటనే 77 గేట్లను ఎత్తి నీటిని వదిలేశారు. 7వ బ్లాకులోని 15 నుంచి 22 నంబర్ వరకు గేట్లు మొరాయించాయి. కాళేశ్వరం బ్యారేజీల్లోని లోపాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ.. బ్యారేజీలను పలుమార్లు పరిశీలించి ఇటీవల మధ్యంతర నివేదిక సమర్పించింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం 2019 జూలైలో పూర్తవగా.. అదే ఏడాది వచ్చిన వరదల సమయంలో బ్యారేజీ ప్రమాద సంకేతాలను వెలువరించిందని పేర్కొంది. బ్యారేజీలకు వానాకాలంలోగా నిర్వహించాల్సిన అత్యవసర మరమ్మతులు, చర్యలను సిఫారసు చేసింది. అయితే వానాకాలానికి ముందే మేడిగడ్డ బ్యారేజీలో మొరాయించిన గేట్లను పైకి ఎత్తేయాలని సూచించింది. అందులోనూ పగుళ్లు వచ్చిన 19, 20, 21 పియర్ల మధ్య ఉన్న గేట్లను అత్యంత జాగ్రత్తగా పైకి ఎత్తాలని స్పష్టం చేసింది. నీటి పారుదల శాఖ అధికారులు నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ సిబ్బందితో కలసి ఈ నెల 17న 15వ నంబర్ గేటును విజయవంతంగా పైకి ఎత్తారు. తర్వాత 16వ నంబర్ గేటును ఎత్తడానికి ప్రయత్నించగా.. శబ్దాలు, ప్రకంపనలు వచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి.పరీక్షలన్నీ చేయించడంపై దృష్టి మేడిగడ్డ బ్యారేజీ దిగువన ఇసుక కొట్టుకుపోవడంతో ఏర్పడిన ఖాళీ ప్రదేశం.. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉందన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కుంగిన ఏడో నంబర్ బ్లాకు దిగువకే ఈ బొరియ పరిమితమై లేదని.. మొత్తం బ్యారేజీ కింద ఓ చివరి నుంచి మరో చివరి వరకు ఖాళీ ప్రదేశం ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు.

## జూన్ 5 తరవాత భారాసా దుకాణం బంద్

హైదరాబాద్:ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 5 తర్వాత భారాస దుకాణం మూతపడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం భారాస నేతలను ఆ పార్టీ కార్యకర్తలే వెంటపడి కొడతారన్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంపదనంతా దోచుకున్నది చాలక కేసీఆర్ కుటుంబం దిల్లీకి వెళ్లింది. అవినీతి చేయకుండానే భారాస ఎమ్మెల్సీ కవితపై 8 వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పుల ఖజానా మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. ఇకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోసారి తమ ముఖ్యమంత్రి రేవంత్‌ని తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కేటీఆర్ బచ్చా అని.. తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. కానీ, రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచి లీడర్ అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ వయసులో పోలిస్తే కేటీఆర్ చిన్న పిల్లాడు అని వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి పొట్ట కొట్టి కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్స్ తరువాత బీఆర్ఎస్ భూస్థాపితం అవడం ఖాయం అని అన్నారు. మేడిగడ్డ మాదిరిగానే బీఆర్ఎస్ పార్టీ కూలిపోవడం ఖాయం అన్నారు. కేసీఆర్ కూతురు కవిత చేసిన పనికి రాష్ట్రం పరువు పోతోందని వ్యాఖ్యానించారు. 5వ తేదీ నుంచి బీఆర్ఎస్



కార్యకర్తలే కేటీఆర్, హరీష్ రావునితరిమి కొడుతారని అన్నారు. నందినగర్ నుండి కారులో న్యూట్రల్‌లో వెళ్లినా అసెంబ్లీకి చేరుకోవచ్చునని.. కట్టే పట్టుకొని అసెంబ్లీకి రాలేదు కానీ, బీజేపీ కోసం కెసిఆర్ బస్సులో తిరిగారని కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. అసలు తెలంగాణ కోసం కొట్లాడింది తామేనని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి రెండు మూడు స్థానాల్లో డిపాజిట్ వస్తుందని.. అన్ని స్థానాల్లో ఓడిపోతుందని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. 12 రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ లేకుండా పోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి లీడర్, క్యాడర్ లేకుండా పోతారని అన్నారు. 5వ తేది తర్వాత తెలంగాణ భవన్‌కి తాళం వేసుకోవాల్సి వస్తుందన్నారు. కవితకు బెయిల్ రావట్లేదని కేటీఆర్ పూర్తిగా ఫ్రస్టేషన్‌లోకి వెళ్లారని.. అందుకే ఇష్టారీతిన తమ ప్రభుత్వంపై కారుకూతలు కూస్తున్నారంటూ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నందుకు మా రేవంత్‌ని తిడుతున్నావా? 500 రూపాయలకు సిలిండర్, ఉచిత విద్యుత్ ఇవ్వడమే మేం చేస్తున్న పాపమా? హాస్టల్స్, పేదవారికి ఇచ్చే ఉచిత బియ్యం పూర్తిగా సన్నబియ్యం ఇద్దామనుకోవడం తప్పా? మేం ఇచ్చిన నోటిఫికేషన్ కాంగ్రెస్ క్లెయిమ్ చేసుకుంటుంది అంటున్నావ్. మరి మీరే ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మా ముందు చూపుతోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. కేసీఆర్ చేసిన పనికి మూడు డ్యాములు కొట్టుకొని పోయే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు. కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయలు వృధా చేశారు. వైన్ షాపుల పేరు మీద కేసీఆర్ నాన్ రిఫండబుల్ పైసలు గుంజిండు. ఏకకాలంలో రుణమాఫీ చేయబోతున్నాం. మల్లన్నపై కేసులు ఉన్నాయని అంటున్నావ్.. మీ చెల్లిపై 8000 పేజీల ఛార్జ్ షీట్ పై ఏమంటావ్ కేటీఆర్? మహేశ్వర్ రెడ్డి ఏం పైరవీ చేసుకొని పదవి తెచ్చుకున్నారు? ఆయన పేరు పలకాలంటే సిగ్గుగా ఉంది?' అని కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణ బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఈ డిపార్ట్‌మెంట్‌కి వెళ్లినా మహేశ్వర్ రెడ్డి ఆర్టీఐ అప్లికేషన్లే ఉంటున్నాయని అన్నారు. బ్లాక్ మెయిల్ చేసి పైసలు సంపాదించాలని మహేశ్వర్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు.



## ఎన్నికలపై ఉన్న ధ్యాస.ధాన్యం కొనుగోళ్లపై ఏదీ

**భువనగిరి:** సీఎం రేవంత్‌రెడ్డికి రైతులకంటే ఎన్నికలే ముఖ్యంగా మారాయని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఐకేపీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని, 45 రోజులుగా ధాన్యం వస్తున్నా.. కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగడం లేదని ఆరోపించారు. భువనగిరి నియోజకవర్గం బీబీనగర్ మండలంలోని రాఘవపూర్, రుద్రవెల్లి గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను కేంద్రమంత్రి గురువారం సందర్శించారు. కొనుగోళ్ల తీరుతోపాటు పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం కుప్పలను పరిశీలించారు. కొనుగోలు ఆలస్యం కావడానికి గల కారణాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గతంలో ఈ విషయంలో భారాస మోసం చేసింది. అదే దారిలో హస్తం పార్టీ నడుస్తోంది. రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరి' అన్నారు. దొడ్డు వడ్లు సాగు చేస్తే బోనస్ ఇవ్వబోమని ఇప్పుడు రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అన్నదాతలకు రుణమాఫీ లేదు.. బోనస్ లేదు. కాంగ్రెస్ సర్కారు తీరుతో బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. దేవుడి మీద ఒట్టు పెడితే వ్యవసాయదారులకు న్యాయం జరగదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి గింజ కొనడానికి సిద్ధంగా ఉంది' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల్లో వ్యతిరేకతను మూటగట్టుకునేందుకు భారాసకు పదేళ్లు పడితే... కాంగ్రెస్‌కు 5 నెలలే పట్టింది. దొడ్డు వడ్ల రైతులకు అన్యాయం చేస్తే భాజపా సహించదు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలి. రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి. బ్యాంకర్లు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదు. కానీ, ఆ పార్టీ నేతలు దిల్లీకి సూట్‌కేస్‌లు మోసుకెళ్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే గద్దె దిగాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి వెంట భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, భాజాపా ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, కిసాన్ మోర్చా నాయకులు గోలీ మధుసూదన్ రెడ్డి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, పడమటి జగన్మోహన్ రెడ్డి, ఎన్నం శివకుమార్, తదితరులు ఉన్నారు.

## మాచర్ల ఘటనలో అధికారుల సస్పెన్షన్

అమరావతి: మాచర్ల నియోజకవర్గం పరిధిలోని పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో సరైన సమాచారం ఇవ్వనందుకు విధుల్లో ఉన్న పీవో, ఏపీవోలను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినట్టు సీఈవో ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసేందుకు ఎస్పీ, డీఎస్పీలతో 8 పోలీసు బృందాలు పని చేస్తున్నాయన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు విషయంలో ఈసీ సీరియస్‌గా ఉందని, త్వరలోనే అరెస్టు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తల్ని పరామర్శించేందుకు తెదేపా నేతలు వెళ్లటం ఇప్పుడు మంచిది కాదని, ఇప్పుడిప్పుడే పరిస్థితులు అదుపులోకి వస్తున్నాయన్నారు. పరామర్శలకు ఈ సమయంలో వెళ్లొద్దని రాజకీయ నేతలకు విజ్ఞప్తి చేశారు. బయటి నుంచి నేతలెవరూ పరామర్శకు వెళ్లకూడదు, ఎవరినీ ఆ గ్రామాలకు వెళ్లనీయొద్దని సూచనలు జారీ చేశాం. పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన దృశ్యాలు ఈసీ నుంచి బయటకు వెళ్లలేదు. దర్యాప్తు సమయంలో ఎక్కడో.. ఎవరి చేతి నుంచో బయటకు వెళ్లాయి. ఈనెల 25 నుంచి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించేందుకు రాష్ట్రంలో పర్యటిస్తానని ఎంకే మీనా తెలిపారు.

## బాండ్ పేపర్లు రాసిచ్చి..ఇంత దగానా

**జగిత్యాల:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సిద్దిపేట భారాస ఎమ్మెల్యే మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ధాన్యం విక్రయం కోసం నెలరోజులుగా పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో పర్యటించిన ఆయన.. పూడురులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వం 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ప్రస్తుతం 37 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. రైతులంతా హైదరాబాద్‌కు వచ్చి ఉద్యమం చేస్తామంటున్నారని పేర్కొన్నారు. వడ్లకు బోనస్ ఏమైందని అడిగితే.. వ్యవసాయ మంత్రి కొందరు మొరుగుతున్నారంటూ రైతులను కుక్కలతో పోలుస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు బాండ్ పేపర్‌పై రాసిచ్చి.. వడ్లకు బోనస్ ఇస్తామని ఇవాళ సన్నాలకు మాత్రమే ఇస్తామని ఇవాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని అన్నారు. ఆరోజు మీరు రాసిచ్చిన బాండ్ పేపర్‌పై సంతకాలు పెట్టారు కదా? మీరు సంతకాలు పెట్టి.. నమ్మబలికి బాండ్ పేపర్లు ఇచ్చి.. చేతుల్లో పట్టుకొని ఇవాళ వడ్లకు బోనస్ ఏమందంటే చేతులెత్తేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## డ్రగ్స్ టెస్ట్‌లో అడ్డంగా దొరికిన నటి హేమ


**బెంగళూరు:** బెంగుళూరు శివార్లలో జరిగిన రేవ్ పార్టీలో రోజు రోజుకీ కొన్ని సంచలన విషయాలు బయటపడుతున్నాయి. రేవ్ పార్టీలో పాల్గొన్న నటి హేమ బ్లడ్‌ఓ డ్రగ్స్ నమూనాలు ఉన్నట్లు

గుర్తించారు. రేవ్ పార్టీలో పాల్గొన్నా వారందరి రక్త నమూనాలు సేకరించిన బెంగుళూరు పోలీసులు పరీక్షకి పంపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అందులో టాలీవుడ్ నటి హేమ రక్త నమూనాల్లో డ్రగ్స్ ఉన్నట్లు నార్కొటిక్ టీమ్ పేర్కొంది. ఇప్పుడు ఈ విషయంతో రేవ్‌పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని హేమ చెప్పిన మాటలు అన్ని అబద్ధాలే అని తేలిపోయింది. ఈ రేవ్ పార్టీ తరువాత హేమ తాను అక్కడ లేనట్టుగా చిత్రీకరించడానికి బిర్యానీ ఎలా చేస్తారు లాంటి మామూలు వీడియోలు విడుదల చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చాలా ప్రయత్నాలు చేసింది. కానీ ఇప్పుడు ఆమె రక్త నమూనాలో మాదకద్రవ్యాలు తీసుకున్నట్టుగా రూఢీ కావటంతో ఇక ఆమె ఎన్ని చెప్పినా, ఆమె ఆ పార్టీలో వుంది, మాదకద్రవ్యాలు సేవించింది అనే విషయం స్పష్టం అయింది. 'సన్ సెట్ టు సన్ రైజ్ విక్టరీ' పేరుతో బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ జీఆర్ ఫామ్ హౌస్‌లో గత ఆదివారం రేవ్‌పార్టీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ రేవ్‌పార్టీలో పాల్గొన్న 103 మంది రక్త నమూనాలను ఇటీవల బెంగళూరు నార్కొటిక్ టీమ్ సేకరించింది. 103 మందిలో మొత్తం 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. 59 మంది పురుషుల, 27 మంది మహిళల రక్త నమూనాలు పాజిటివ్ అని తేలింది. నటి హేమ కూడా డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. రక్త నమూనాలు పాజిటివ్‌గా తేలిన వారందరికీ సీసీబీ సమన్లు జారీ చేయనుంది. అదే రేవ్‌పార్టీ జరిగిన ఫామ్‌హౌస్‌లోనే నటి హేమ ఉందని, ఆమె వీడియో అక్కడే రికార్డ్ చేసిందని బెంగళూరు పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు.

## ఆర్టీసీ కొత్త లోగోను విడుదల చేయలేదు

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చింది. అయితే, టీసీఎస్ఆర్టీసీ లోగో ఇదేనంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. కొత్త లోగో విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. అధికారికంగా ఇప్పటివరకు కొత్త లోగోను సంస్థ విడుదల చేయలేదన్నారు. టీజీఎస్ఆర్టీసీ కొత్త లోగో అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న లోగో ఫేక్ అంటూ క్లారిటీ ఇచ్చారు. ఆ లోగోతో సంస్థకు ఎలాంటి సంబంధం లేదని.. కొత్త లోగోను సంస్థ రూపొందిస్తుందని ఆయన తెలిపారు. కొత్త లోగోను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇంకా ÷నైల్ చేయలేదన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు టీఎస్ ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మారుస్తూ మంగళవారం ఆర్టీసీ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చామని సజ్జనార్ పేర్కొన్నారు. సలహాలు, సూచనలతో

వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
24-5-2024



# ప్రజారోగ్యంతో చెలగాటం



**హైదరాబాద్:** జ్వరం, దగ్గు, నొప్పులు, రక్తపోటు, మధుమేహం, చివరికి ప్రాణాంతక క్యాన్సర్‌కు మనం వాడుతున్న చాలా మందుల్లో ఏవి అసలైనవో ఏవి నకిలీవో తెలియని దుస్థితి... అవి నాణ్యమైనవా, కల్తీవా అనేది గుర్తించలేని పరిస్థితి... నోట్లో వేసుకున్న మందు, ఒంటికి రాసుకున్న ఆయింట్‌మెంట్ పనిచేస్తోందో లేదోననే ఆందోళన... వీటికితోడు కాలం చెల్లిన మందులు, వాటిని విక్రయించే అనుమతిలేని మెడికల్ షాపులు... అధిక ధరలతో రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం దైవాధీనంగా తయారైంది. ఆందోళనకు గురిచేస్తున్న ఈ అంశాలన్నీ సాక్షాత్తూ రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి(డీసీఏ) చేస్తున్న దాడులు, తనిఖీల్లో వెల్లడైనవే కావడం గమనార్హం. హైదరాబాద్‌తోపాటు వివిధ జిల్లాల్లో గత ఏడెనిమిది నెలలుగా డీసీఏ తనిఖీలు చేస్తోంది. ఒకవైపు కేసుల నమోదు, నకిలీ మందుల స్వాధీనం వంటివి జరుగుతున్నా... మరోవైపు యథేచ్ఛగా అక్రమాలు కొనసాగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కల్తీ ఔషధాలు రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా తీసుకొస్తుండగా మరికొన్ని రాష్ట్రంలోనే తయారవుతున్నాయి.ఉత్తరాది నుంచి ఉత్తుత్తి ఔషధాలు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కాశీపుర్, కొత్‌ద్వార్‌లలో తయారైన నకిలీ మందులు రాష్ట్రానికి యథేచ్ఛగా వస్తున్నాయి. ఈ వ్యవహారంలో భారీ రాకెట్‌ను డీసీఏ ఛేదించింది. అక్కడ నుంచి కొరియర్ కంపెనీల ద్వారా మందులను తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నారు. వాటిలో యాంటీబయాటిక్స్, రక్తపోటు, కొలెస్ట్రాల్ తగ్గించేవి ఉన్నాయి. ప్రముఖ తయారీ సంస్థలైన సన్‌ఫార్మా, గ్లెన్‌మార్క్ ఫార్మా, అరిస్టో ఫార్మా వంటి సంస్థల మాత్రలు, మందులకు నకిలీలను తయారు చేయిస్తున్నారు.

# బీడి పెట్టె కార్మికులకు వేతనాలు పెంచాలి.



**బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిగాద సిద్ధిరాములు డిమాండ్.**

**ఏంఎస్ లంగర్ బీడి కంపెనీ యాజమాన్యానికి డిమాండ్ నోటీసు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 23:**

ఏంఎస్ లంగర్ బీడి కంపెనీలో పెట్టె (బాక్సులు) కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు సిరిగాద సిద్దిరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఏంఎస్ లంగర్ బీడి కంపెనీ జనరల్ మేనేజర్ ఉమకాంత్, అసిస్టెంట్ మేనేజర్ రాజు బాయి పటేల్ కు డిమాండ్ నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్దిరాములు మాట్లాడుతూ, ఏంఎస్ లంగర్ బీడి కంపెనీ నిజామాబాద్ హెడ్ ఆఫీసు పరిధిలో నిర్మల్, కామారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో దేగాం, బస్వాపూర్, పాల్వంచ, తంగళపల్లి, ముస్తాబాద్, సిద్దిపేట, లచ్చపేట్, నిజాంపేట లో బీడి సెంటర్లు ఉన్నాయని అన్నారు. ఈ సెంటర్లలో బీడీ కట్టలకు బుగ్రలు(బాక్స్ లు) పెట్టె కార్మికుల కు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కూలీ రోజు రూ"600 , నెలకు 18000 జీతం పెంచి ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కారించాలని అన్నారు. బీడీ కంపనీలో బీడీ కట్టలకు బుగ్రలు (బాక్స్ లు) కార్మికులకు ప్రతి రెండు సంవత్సరాల కు ఒక్కసారి వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. గత ఒప్పందం, 30-4-2024 నాటికి ముగిసిందన్నారు. 1-05-2024,నుండి నూతన వేతన ఒప్పందం పై యాజమాన్యం కార్మికుల వేతనం పెంపు ఒప్పందం చేసుకోవలసి ఉందన్నారు. పెట్టె కార్మికులకు రోజు 600రూపాయలు, నెలకు 18000 వేతనం పెంచి ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనాలు, ఇవ్వాలని, అందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, కల్పించాలని డిమాండ్ చేశారు. దీనికి కంపెని జనరల్ మేనేజర్ ఉమకాంత్ స్పందిస్తూ, యాజమాన్యం తో చర్చించి త్వరలోనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం నాయకులు సయ్యద్,వేణు పాల్గొన్నారు.

# ప్రమాదంలో నాలుగో స్తంభం.

**ప్రజాస్వామ్యం మనుగడకే పెనుముప్పు.**

**బావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం.**

**తటస్థ వార్తలతో నష్టం.**

**హంసల మాదిరిగా జర్నలిస్టులు పనిచేయాలి.**

**తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి. ప్రజా కవి నందిని సిధారెడ్డి.**




**వేగుచుక్క న్యూస్ ,నిజామాబాద్, మే 23:**

నాలుగో స్తంభానికి ప్రమాదం తలెత్తితే ప్రజాస్వామ్యం మనుగడకే పెనుముప్పు వాటిల్లనుందని తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కే.శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ ప్రజా కవి నందిని సిధారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వచ్చే నెల 19, 20 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలోని బస్వా గార్డెన్ లో ఆ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో "ప్రజాస్వామ్యం - మీడియా" అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిదిగా తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, విశిష్ట అతిథిగా ప్రముఖ రచయిత, ప్రజాకవి నందిని సిధారెడ్డి, గౌరవ అతిథులుగా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సుదర్శన్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజీరెడ్డి గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కె. శ్రీనివాస్ రెడ్డి ప్రసంగిస్తూ, పాలక ప్రభుత్వాలు మీడియా విషయంలో పోషిస్తున్న పాత్రను వివరించారు. గతంతో పాటు ప్రస్తుతం ఉన్న తారతమ్యాలను వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛను హరించేందుకు మూడు బిల్లులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దేశంలోని జర్నలిస్టులందరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మీడియా వ్యవస్థ పరిరక్షణకై ఐజేయు, ఇండియన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో నూతన బిల్లును రూపొందించి చట్టసభల ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్ళనున్నట్లు తెలియజేశారు. జర్నలిస్టులు సైతం నైతిక విలువలను పాటిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు. జర్నలిస్టులు తటస్థంగా వ్యవహరిస్తే మీడియాకే కాదు, ప్రజాస్వామ్యానికి తీరని ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వార్తకు తటస్థత లేదని, తటస్థత ఉంటే అది ప్యాకేజీ వార్తనే అవుతుందని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి కేవలం ప్రభుత్వం వైపు చూడకుండా, మీడియా సంస్థల యాజమాన్యాలు వ్యవహరిస్తున్న తీరును గమనించాలని ఉద్బోధించారు.
పత్రికా స్వేచ్ఛలో ప్రపంచంలో భారతదేశం 159 వ స్థానానికి పడిపోయిందని, పాలక ప్రభుత్వాల తీరుతో జర్నలిస్టులకు సమాజంలో గౌరవం తగ్గిందనేది సత్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల తరఫున పనిచేస్తున్న మీడియాకు పారదర్శకత అవసరమని, నాలుగో స్తంభంలా ఉన్న మీడియా నైతిక విలువలను పాటించాలని సూచించారు. అంతకు ముందుగా తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్, ప్రజాకవి, ప్రముఖ రచయిత నందిని సిధారెడ్డి ప్రసంగిస్తూ, మీడియా అనేది ప్రజాస్వామ్యనికి గుండె లాంటిదని, ప్రస్తుతం నాలుగో స్తంభానికి ప్రమాదం పొంచి ఉందని అన్నారు. రచయితలు, జర్నలిస్టులకు రక్తసంబంధం ఉందని, ఈ సంబంధం మరింత గట్టిదైతేనే నాలుగో స్తంభంగా మీడియాను రక్షించుకోగలుగుతామని అభిప్రాయపడ్డారు. నిక్కచ్చిగా వార్తలు రాసినప్పుడే జర్నలిజం మనుగడ సాగిస్తుందని పేర్కొన్నారు. సమాచార హక్కు ప్రజలకున్నప్పటికీ పాలకులు పట్టించుకునే పరిస్థితి లేదని, సత్యాన్ని రాసిన జర్నలిస్టు షోయాబుల్లాఖాన్ హత్య ఉదాంతాన్ని గుర్తు చేశారు. నిజాం నిరంకుశత్వాన్ని నిలదీసినందుకు పత్రిక కార్యాలయం ఎదుటే ఆయనను దారుణంగా హత్య చేసినప్పటికీ, ప్రజలు ఆయనను మరిచిపోలేరని అన్నారు. జర్నలిస్టులందరూ హంసల పాత్ర పోషించాలని, నీతి, అవినీతిని... పాలు, నీరులాగా వేరు చేసినప్పుడే జర్నలిస్టులకు గుర్తింపు ఉంటుందని ఆయన హితవు పలికారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ మాట్లాడుతూ జర్నలిజం వృత్తి లో ప్రస్తుతం అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఆ సవాళ్లను అధిగమిస్తూ ప్రజల సమస్యలను, ప్రభుత్వ పొరపాట్లను అనేక మంది జర్నలిస్టులు ప్రజల ముందు ఉంచుతున్నారని అభినందించారు. నిష్పక్షపాతంగా సమాచారం ప్రజలకు చేరవేయాలని కోరారు.రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి ప్రసంగిస్తూ జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళల సహకరిస్తామని అన్నారు. 30 ఏళ్ల క్రితం ఉన్న జర్నలిజం, ప్రస్తుతం ఉన్న జర్నలిజం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తు చేశారు. పార్టీలకు మద్దతు తెలిపే యాజమాన్యాల చేతుల్లో మీడియా ఉండడం వల్ల ప్రజా సమస్యలు బయటకు రాని పరిస్థితి కనిపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.
మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ, ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని అన్నారు. వాస్తవికతను ప్రజల ముందు ఉంచాలని, లోటుపాట్లు ఏమైనా ఉంటే బేషజాలకు పోకుండా తమ ప్రభుత్వం కచ్చితంగా చర్యలు చేపడుతుందని అన్నారు.



# భారత్‌ను విభజించి రెండు ముస్లిం దేశాలు చేసిన కాంగ్రెస్



**చండీఘడ్:**భారత్‌ను విభజించి రెండు ముస్లిం దేశాలు చేసిన కాంగ్రెస్ పార్టీ అంటూ ప్రధాని మోడీ ఘాటు విమర్శలు చేశారు. ముస్లిం ఓటు బ్యాంక్ కోసం ఇండియా కూటమి తహతహ లాడుతోందన్నారు. అయితే దళితులు, గిరిజనలు రిజర్వేషన్లు యధాతథంగా ఉంటాయని, తన ప్రాణం ఉన్నంత వరకు వాటిని ఎవరూ లాగేసుకోలేరని అన్నారు. హర్యానా ప్రచరాంలో ప్రధాని మోడీ ఉద్వేగ ప్రసంగం చేశారు. తాను జీవించి ఉన్నంత వరకు దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ లాక్కోలేరని ప్రధాని మోడీ అన్నారు. రాజ్యాంగం కల్పించిన వారి హక్కులపై దుష్ప్రచారం చేయడం దారుణమని అన్నారు. హర్యానాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ రిజర్వేషన్లపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులు దేశం కన్నా వారి ఓటుబ్యాంకు ముఖ్యమని, ఈ వ్యక్తులు తమ ఓటు బ్యాంకు కోసం దేశాన్ని విభజించారని, వారు ఇండియాను విభజించి రెండు ముస్లిం దేశాలను సృష్టించారని అన్నారు. కలకత్తా హైకోర్టు 2010 తర్వాత జారీ అయిన ఓబీసీ సర్టిఫికేట్లను రద్దు చేసింది. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మోడీ విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో వారు రాత్రికి రాత్రే ముస్లింలకు, చొరబాటుదారులకు ఓబీసీ సర్టిఫికేట్లు జారీ చేశారు. గత 10-12 ఏళ్లలో ముస్లింలకు జారీ చేసిన అన్ని ఓబీసీ సర్టిఫికేట్లను హైకోర్టు రద్దు చేసింది. కలకత్తా హైకోర్టు నిర్ణయాన్ని సీఎం మమతా బెనర్జీ అంగీకరించడం లేదని, వారు ఓబీసీ రిజర్వేషన్లను ముస్లింలకు ఇవ్వాలని కోరుకుంటున్నారు. ఇది ఇండియా కూటమి మనస్తత్వం అని ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టీఎంసీ, ఇతర ఇండియా కూటమికి చెందిన పార్టీలు వారి ఓటు బ్యాంకుకు మద్దతు ఇస్తున్నాయని, అయితే మోడీ జీవించి ఉన్నంత వరకు దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ లాక్కోలేరని మీకు భరోసా ఇస్తున్నానని మోడీ అన్నారు. ఇది రాజకీయ ప్రసంగం కాదని, అణగారిన వారి హక్కులకు తాను ఇచ్చే హామీ అని అన్నారు. 2010 తర్వాత పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఓబీసీ సర్టిఫికేట్లను కలకత్తా హైకోర్టు బుధవారం రద్దు చేసింది. 1993 చట్టం ప్రకారం క్షఃఅల కొత్త జాబితాను సిద్ధం చేయాలని పశ్చిమ బెంగాల్ వెనుకబడిన తరగతుల కమిషన్‌ను కోర్టు ఆదేశించింది. దాదాపుగా 5 లక్షల ఓబీసీ సర్టిఫికేట్లు రద్దయ్యాయి. 2010 తర్వాత ఓబీసీ కోటా కింద ఉద్యోగాల్లో ఉన్నవారు, వాటిని పొందే పక్రియలో ఉన్న వారు కోటా నుంచి మినహాయింపబడరు. వారి ఉద్యోగాలపై ఎలాంటి ప్రభావం ఉండదు. కలకత్తా హైకోర్టు తీర్పు తర్వాత, ఈ తీర్పును అంగీకరించ బోమని సీఎం మమతా బెనర్జీ అన్నారు.



# పన్నులు చెల్లిస్తున్నాం... రోడ్లు బాగు చేయండి!

**బండ్లగూడ:** అధ్వానంగా మారిన రహదారిని బాగు చేయాలని డిమాండ్ చేస్తూ వర్షపు నీటితో నిండిన గుంతలో ఓ మహిళ బైఠాయించిన ఘటన హైదరాబాద్‌లోని నాగోల్ డివిజన్ ఆనంద్‌నగర్ చౌరస్తాలో గురువారం చోటుచేసుకుంది. కుంట్లూర్‌కు చెందిన గోటేటి నిహారిక రోజూ ఈ మార్గంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుంటారు. వారం కిందట చౌరస్తాలోని గుంతల కారణంగా వాహనంపై నుంచి కిందపడి.. స్వల్పంగా గాయపడ్డారు. ఇటీవల వర్షాలకు నీరు నిలిచి ఆ గుంతలన్నీ పెద్దవిగా మారడంతో గురువారం మధ్యాహ్నం... నీటితో నిండిన రోడ్డుపై బైఠాయించారు. తాము పన్నులు చెల్లిస్తున్నామని, మంచి రోడ్లు కావాలని ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానిక మహిళలు ఇద్దరు ఆమెకు మద్దతుగా నిలిచారు. చౌరస్తాలో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో మహిళా పోలీసులు ఆమెను పక్కకు తీసుకొచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి... ఎన్నికల కోడ్ ముగియగానే పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. నాగోల్ పోలీసులు ఆమె వివరాలను నమోదు చేసుకున్నారు.

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

**హైదరాబాద్:**పశ్చిమ మధ్య, దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని, శనివారం నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం వాతావరశాఖ తెలిపింది. ఈ నెల 25న తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశాలు ఉన్నాయని.. 26 నాటికి పశ్చిమ బెంగాల్ తీరానికి తుఫాను చేరుతుందని పేర్కొంది. బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు విస్తరించాయి.



# వడ్లకు మద్దతు ధరలపై అబద్ధాలు



**భూపాలపల్లి:** సన్న బియ్యానికే మద్దతు ధర ఇస్తారట.. మన తెలంగాణాలో దొడ్డు బియ్యం ఎక్కువగా పండిస్తామని... పండించిన రైతుల పరిస్థితి ఎంటని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. వడ్లకు బోనస్ అని చెప్పి బోగస్ చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి హరీష్ రావుకాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గురువారం భూపాలపల్లిలో పర్యటించిన ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి గ్రాడ్యుయేట్ ఎన్నిక జరిగినప్పుడల్లా మనమే గెలిచామని, బిట్స్ పిలానిలో గోల్డ్ మెడలిస్ట్ ఆయన రాకేష్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నీ తుస్సుమన్నాయని, కాంగ్రెస్ ప్రచారంలో 6 గ్యారంటీల్లో ఐదు అమలు చేసినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారని, జాబ్ క్యాలెండర్ పత్తా లేకుండా పోయిందని హరీష్ రావు విమర్శించారు. ఉపాధ్యాయుల మీద లాఠీ ఛార్జ్ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు పెంచిందని, మహిళా గ్రాడ్యుయేట్‌లు కూడా బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్నారన్నారు. మహిళా పథకం కింద వారికి నెలకు రూ. 2,500 ఇస్తాం అని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. నిన్న వరంగల్ ఎంజీఎంలో కరెంట్ పోయిందన్నారు. విద్యుత్ ఉద్యోగులను కూడా ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని హరీష్ రావు పేర్కొన్నారు.




# ఓటిటిలోకి విశాల్ రత్నం మూవీ

తమిళ నటుడు విశాల్ చాలా రోజులు తర్వాత 'రత్నం' అంటూ ఊరమాస్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. సింగం చిత్రాల ఫేమ్ హరి ఈ సినిమాకు దర్శకత్వం వహించగా ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటించింది. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో వరల్డ్ వైడ్‌గా ఏప్రిల్ 26న విడుదల చేయగా.. బాక్సాఫీస్ వద్ద మోస్తరు విజయం అందుకుంది. అయితే ఈ చిత్రం విడుదలై నెల రోజులు కూడా కాకముందే ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు బోర్డర్ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా స్టోరీ ఉండగా.. సముద్రఖని, యోగిబాబు, గౌతమ్ వాసుదేవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి నేషనల్ అవార్డు విన్నర్ దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించాడు.







# బేబీజాన్‌లో కేక పుట్టించిన కీర్తి సురేశ్

మహానటి సినిమాతో తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది కీర్తిసురేశ్. ఈ సినిమాతో నేషనల్ అవార్డు అందుకున్న కీర్తిసురేశ్ బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న బేబీజాన్‌లో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోందని తెలిసిందే. కాగా ఈ మూవీలో కీర్తిసురేశ్ బోల్డ్ లిప్‌లాక్ సీన్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్న వార్త ఒకటి బీటౌన్‌గా హాట్ టాపిక్‌గా మారింది. బేబీ జాన్‌లో వామికా గబ్బి మరో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని కోలీవుడ్ డైరెక్ట్ కాలీస్ డైరెక్ట్ చేస్తుండగా.. జవాన్ డైరెక్టర్ అట్లీ నిర్మిస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీ నుంచి ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తోంది. ఈ చిత్రాన్ని మే 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. సినీ1 స్టూడియోస్, జియో స్టూడియోస్‌తో కలిసి ప్రియాఅట్లీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బేబీజాన్ కీర్తిసురేశ్ బాలీవుడ్ డెబ్యూ సినిమా కావడం విశేషం. ఈ భామ ప్రస్తుతం తమిళంలో నాలుగు సినిమాల్లో నటిస్తోంది.





## దేవర ఫియర్ సాంగ్‌కు

**50 మిలియన్లకుపైగా వ్యూస్**

జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ దేవర చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. పాన్ ఇండియా స్థాయిలో వస్తోన్న ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుండగా.. దేవర పార్టు 1 అక్టోబర్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా దేవర నుంచి ఇటీవలే ఫియర్ సాంగ్ ను లాంఛ్ చేశారు. అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన ఈ పాట నెట్టింట గూస్‌బంప్స్ తెప్పిస్తోంది.

# బుజ్జితో ప్రయాణం ఎంతో ఆసక్తికరం




**అమితాబ్, కమల్ సర్‌లతో నటించడం అదృష్టం**



బుజ్జితో కలిసి భైరవ చేసిన ప్రయాణం ఎంతో ఆసక్తికరం. ఈ పాత్రలతో మూడేళ్లు ప్రయాణం చేశా' అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కల్కి 2898 ఎ.డి'. దీపికా పదుకొణె కథానాయిక. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించారు. జూన్ 27న సినిమాని విడుదల చేస్తున్నారు. పురాణాలతో ముడిపడిన సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. ఇందులో భైరవ అనే పాత్రలో కనిపిస్తారు ప్రభాస్. బుజ్జి అనే పేరుతో కూడిన వాహనం కూడా కథలో కీలకం. బుజ్జి, భైరవ పాత్రల్ని పరిచయం చేస్తూ బుధవారం రాత్రి రామోజీ ఫిల్మ్‌సిటీలో ఓ వేడుకని నిర్వహించారు.

# క్రూయిజ్ షిప్‌లో వారిని ఆకట్టుకోవాలన్నారు..!



మీటూ ఉద్యమంలో చాలామంది తారలు లైంగిక వేధింపుల గురించి ఓపెనయ్యారు. ఇందులో ప్రముఖ కథానాయికలు కూడా ఉన్నారు. ఏదో ఒక సమయంలో తాము అలాంటి వేధింపులను ఎదుర్కొన్నామని వెల్లడించారు. ఇప్పుడు ప్రముఖ టీవీ నటి లైంగిక వేధింపుల గురించి ఓపెనయ్యారు. అనేక పాపులర్ షోలలో పనిచేసిన అహి విజ్ ఇటీవల భయానకమైన కాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. ఈమె జై భానుషాలి భార్య. ఓసారి తాను షూటింగ్ కోఆర్డినేటర్‌ను కలవడానికి వెళ్లినప్పుడు తన రేటు కార్డు గురించి చెప్పినట్లు వెల్లడించింది. ఇది అహి విజ్ కెరీర్ తొలినాళ్లలో జరిగింది.తాజా ఇంటర్వ్యూలో మహి విజ్ తన భయానక అనుభవాన్ని గుర్తు చేసుకుంది. మహి ఢిల్లీకి చెందిన యువతి. నటనలో తన వృత్తిని కొనసాగించడానికి 17 సంవత్సరాల వయస్సులో ముంబైకి మారింది. పాపం కెరీర్ ప్రారంభ రోజుల్లో కాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. షూటింగ్ కోఆర్డినేటర్ అని చెప్పుకునే వ్యక్తి నుండి తనకు కాల్ వచ్చిందని మహి విజ్ చెప్పారు. ఆమె అతడిని కలవడానికి అంగీకరించింది. అతడి కారులో తన సోదరితో కలిసి జుహుకి వెళ్ళింది. ఆ వ్యక్తి తన రేట్ కార్డ్ గురించి ..క్రూయిజ్‌లో ఇతరులను ఎలా ఆకట్టుకోవాలి అనే దాని గురించి తెలియజేశాడు.అతడి మాటలు విన్న మహి ఒక్కసారిగా షాక్ అయింది. అక్కడ ఏదో తప్పు జరుగుతోందని గ్రహించింది. వారు వెనుక సీట్లో కూర్చున్నారు. మహి, తన సోదరితో కలిసి వెంటనే అతడి జుట్టు పట్టుకుని గుంజి తప్పించుకోగలిగింది. మహీ విజ్ టీవీ పరిశ్రమలో ప్రముఖ వ్యక్తి. అకేలా, కైసీ లాగి లగన్, లాగీ తుజ్సే లగన్ మొదలైన షోలకు పనిచేశారు.

# లవ్‌మీ సినిమాతో వస్తున్న వైష్ణవి చైతన్య



ఈమధ్య కాలంలో ఒక తెలుగమ్మాయికి మంచి పేరు వచ్చిందంటే ఆ అమ్మాయి ఒక్క వైష్ణవి చైతన్య అనే చెప్పాలి. 'అల వైకుంఠపురంలో' అల్లు అర్జున్‌కి చెల్లెలుగా నటించి 'వాళ్ళు నా చున్నీ ఎత్తుకెళ్లి పోయారురా' అంటూ అల్లు అర్జున్ తో అన్న ఆ సన్నివేశం అందరికీ గుర్తుంది. అదే వైష్ణవి చైతన్య గురించి అదే అల్లు అర్జున్ 'బేబీ' సినిమా విజయోత్సవ సభలో ఎంత గొప్పగా చెప్పారో కూడా అందరికీ తెలిసిన విషయమే. వైష్ణవి చైతన్య 'బేబీ' అనే సినిమాతో తెలుగు పరిశ్రమలో ఒక ప్రకంపనలు సృష్టించింది. ఎక్కడినుండో వచ్చి తెలుగురాని కథానాయికలు ఏలుతున్న ఈ సమయంలో అవకాశం ఇస్తే తెలుగు అమ్మాయి ఎంత చక్కటి ప్రతిభను కనబరుస్తుందో చేసి చూపించింది వైష్ణవి. 'బేబీ' సినిమాతో విమర్శకుల ప్రశంసలే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో యువతని కూడా ఇట్టే ఆకర్షించిన నటి వైష్ణవి చైతన్య. ఇప్పుడు 'లవ్ మీ' సినిమాకి ప్రత్యేక ఆకర్షణ వైష్ణవి చైతన్య అని మాత్రమే చెప్పాలి అని అంటున్నారు.'మే 25న విడుదలవబోతున్న 'లవ్ మీ' సినిమాలో అందరి దృష్టి ఇప్పుడు వైష్ణవిపైనే ఉన్నాయని తెలుస్తోంది. 'బేబీ' సినిమాతో ఒక సంచలనం సృష్టించిన వైష్ణవి, 'లవ్ మీ' లో ఎలాంటి పాత్ర చేస్తోంది, ఆమె ప్రతిభని తెలుగు ప్రేక్షకులకి మరోసారి చూపించే దిశగా ఆ పాత్ర ఉంటుందా అనే ఆసక్తితో ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో కథానాయకురాలిగా నటించటంతో పాటు, ఒక పాట కూడా పాడింది వైష్ణవి. లెజండరీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఈ సినిమాకి సంగీతం సమకూరిస్తే, అయన సంగీత దర్శకత్వంలో వైష్ణవి పాట పాడటం ఇంకొక ఆసక్తికరమైన విషయం. ఈ సినిమాకి దర్శకుడు అరుణ్ భీమవరపు, ఛాయాగ్రహణం దేశంలో అత్యంత ప్రతిభావంతుడైన పీసీ శ్రీరామ్. ఇంతమంది పెద్ద పెద్ద సాంకేతిక నిపుణలతో పనిచేసే అవకాశం తన కెరీర్ ఆరంభంలోనే వైష్ణవికి రావటం నిజంగా ఆమె ప్రతిభకి తార్కాణం. ఆశిష్ రెడ్డి ఈ సినిమాలో కథానాయకుడు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

